బీమా ధీమా ఎప్పుడు?

- రైతులకు అమలు కాని కేంద్ర పథకం
- ఏటా అధిక వర్షాలు, వరదలతో పంటలు నష్టం
- పరిహారం అందక అన్నదాతల అవస్థలు



వరదలతో నీటమునిగిన పంట(ఫైల్)

ఆసిఫాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పంటలు దెబ్బతింటే అన్నదాతలకు అందించే ఫసల్ బీమా అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోక పోవడంతో భరోసా లేకుండా పోతు న్నది. ఆరుకాలం కష్ట పడి సాగు చేసిన పంటలు విపత్తుల కారణంగా నష్ట పోతున్నా ప్రభుత్వాలు మాత్రం రైతులను ఆదు కునేందుకు చర్యలు చేపట్టడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు మృతి చెందితే రైతు బీమాను అమలు చేసి కుటుంబాన్ని ఆదుకుంటున్నారు. కానీ రైతు సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లితే మాత్రం సహాయం అందించే దాఖలాలు లేకుండా పోయాయి. కేంద్ర ప్రభుత్వం రైతులు సాగు చేసిన పంటలకు (పీఎంఎ ఫ్‌బీవై) పథకాన్ని అమలు చేస్తుండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం పథకంలో లోపాలున్నాయని పక్క న పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం బీమా పథకాన్ని పునరుద్ధరించ నున్నట్లు వెల్లడించినా ఇప్పటి వరకు క్షేత్ర స్థాయి లో స్పష్టత లేకుండా పోయింది. ప్రకృతి వైపరీత్యా లతో నష్ట పోయే రైతులను ప్రభుత్వం పంట లకు బీమా కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

● తొమ్మిదేళ్ల క్రితం..

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథ కాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫిబ్రవరి 18, 2016న ప్రారంబించారు. ఈ పథకం ద్వారా ప్రీమియం చెల్లిం చిన రైతులకు బీమా కంపెనీలు స్వల్ప నష్టపరిహారం చెల్లించడం పరిహారం చెల్లింపుల్లో ఆలస్యం తదితర కారణాలతో 2019లో అనేక రాష్ట్రాలు పథకం నుంచి నిష్క్రమించాయి. ఇందులో భాగంగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడ పథకంలో లోపాలున్నాయంటూ ఫసల్‌బీమా యోజన పథకాన్ని పక్కన పెట్టింది. అప్పటి నుంచి రాష్ట్రంలో పంట బీమా అమలు కావడం లేదు. ఏటేటా ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, వరదల కారణంగా అన్న దాతలు తీవ్రంగా నష్టపోతున్నా పంట పరిహారం అందడం లేదు. తర్వాత అధికా రంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది వానాకాల సీజన్‌లోనే ఫసల్ బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించినా అమలుకు నోచు కోలేదు. దీంతో తాజాగా వచ్చిన వరదలతో రైతు లకు మరోసారి పంట నష్టం జరిగి ఆర్థికంగా కోలు కోలేని దెబ్బ తగిలింది. ప్రభుత్వ పంట బీమాపై ఇంకా నిర్ణయం తీసుకోకపోవ డంతో ఈ ఏడాది కూడా బీమా నిష్ప్రయోజనం గానే మిగిలింది. మూడేళ్లుగా వానాకాలం సీజన్‌లో అధిక వర్షాలు కురువడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో ఇసుక మేటలు ఏర్పడి రైతాంగం తీవ్రంగా నష్టపో యారు. అయినప్పటికీ ప్రభుత్వాలు రైతులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవ డంతో రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహ త్యలకు పాల్పడుతున్నారు. రైతులు సాగు చేసిన పంటలు అతివృష్టి కారణంగా నష్టపోతు న్న విషయం తెలిసినా ప్రభుత్వం ఆదుకోవడం లేదని రైతులు చెబుతున్నారు.

● పరిహారం దక్కక..

కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత ప్రధానమంత్రి ఫస ల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం రాష్ట్రం లో అమలులో లేకపోవడంతో రైతులకు అటు ప్రభుత్వం నుంచి ఇటు బీమా కంపెనీల నుంచి పరిహారం దక్కడం లేదు. .గతేడాది అక్టోబరులో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పంట బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించారు. కానీ పది నెలలు అవుతున్నా ఆ దిశగా అడుగులు పడలేదు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో పంటలు సాగు అవుతున్నాయి. జిల్లాలో జూలైలో కురిసిన బారీ వర్షాలు, వరదలతో ప్రాణ హిత నది పరివాహక ప్రాంతాలైన సిర్పూర్-టి, కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్, దహెగాం, పెంచికల్‌పేట మండలాలలో పత్తి, కంది, ఇతర పంటలు నష్టపోయాయి. ఆయా మండలాలలో మూడు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తెలుస్తోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపో యా రు. ఫసల్ బీమా లేకపోవడంతో ప్రకృతి వైపరీ త్యా లు ఏర్పడి పంట నష్టం జరిగినప్పుడల్లా అన్నదా తలు ఆర్థికంగా చితికి పోతున్నారు.

పంటలకు బీమా అమలు చేయాలి..

- నందరామ్, రైతు, కోయపల్లి, చింతలమానేపల్లి మండలం



రైతులు సాగు చేస్తున్న పంటలకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించాలి. రైతులు ఆరుకాలం కష్ట పడి అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తే విపత్తుల కారణంగా నష్టం వాటిల్లుతున్నది. ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా నేను రెండు ఎకారాల్లో సాగు చేస్తున్న పత్తి పంటలో ఇసుక మేటలు వేయడంతో నష్టం వాటిల్లింది. రైతులు సాగు చేసిన పంటలకు ప్రభుత్వం ప్రీమియం చెల్లించి బీమా కల్పిస్తే భరోసా ఉంటుంది.

ఎలాంటి ఆదేశాలు రాలేదు..

- మిలింద్, వ్యవసాయాధికారి



పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని ప్రభు త్వం తెలిపింది. కానీ ఇప్పటివరకు పథకం అమలుపై వ్యవసాయశాఖకు ఎలాంటి సూచనలు లేవు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే రైతులకు బీమా పథకం అమలుకు చర్యలు తీసుకుంటాం.

జనహిత పాదయాత్రకు తరలిన నేతలు



ఆసిఫాబాద్ నుంచి పాదయాత్రకు వెళ్తున్న నాయకులు

ఆసిఫాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఉమ్మడి జిల్లాలోని ఖానాపూర్ నియోజక వర్గంలో చేపట్టిన జనహిత పాద యాత్రకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు ఆధ్వ ర్యంలో నాయకులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, చరణ్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): జనహిత పాదయాత్రలో భాగంగా ఆది వారం ఖానాపూర్‌లో చేపడుతున్న కార్యక్రమానికి జైనూర్ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఖానాపూర్ నియోజక వర్గంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప ర్యటిస్తుండడంతో జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో జై నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖాద్, సిర్పూర్(యు) మండల అధ్య క్షుడు ఆత్రం శంకర్, మాజీ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్, ఆత్రం ప్రకాష్, ఆ త్రం అనిల్‌కుమార్, మాజీ సర్పంచులు కనక ప్రతిభ,మెస్రం భూపతి, జాలింషా, తదితరులు పాల్గొన్నారు.

కుమరం భీం ప్రాజెక్టుకు వరద



ఒక గేటు ఎత్తి నీటిని కిందికి వదులుతున్న అధికారులు

ఆసిఫాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురు స్తున్న వర్షాలకు మండలంలోని కుమరం భీం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 243 మీటర్లు కాగా ప్రస్తుతం 237.40 మీటర్లకు చేరుకుంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులో 947 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో ఒక గేటు పైకి ఎత్తి 620 క్యూసెక్కుల వరద నీటిని కిందికి వదులు తున్నారు. పెద్దవాగు పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తం ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో సోషల్ మీడి యాలో వివిధ పత్రికల పేర్లతో వార్తకథనాలను తయారు చేస్తున్న ముఠాపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదివారం కాగ జ్‌నగర్ ప్రెస్ క్లబ్ సభ్యులు డీఎస్పీ రామానుజం, పట్టణ సీఐ ప్రేంసా గర్‌కు ఫిర్యాదు చేశారు. కాగజ్‌నగర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తాళ్లపల్లి సురేందర్‌రావు మాట్లాడుతూ కొన్ని నెలల నుంచి కాగజ్‌నగర్‌లో వివిధ పత్రిక పేర్లతో ఫేక్ కథనాలు సృష్టిస్తున్నారని తెలిపారు. కోరా రు. పట్టణ ప్రెస్ క్లబ్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

కాగజ్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పత్రిక పేపర్‌ను మార్ఫిం గ్ చేసినందుకు చింతగూడకు చెందిన లెండుగురే శ్యాంరావుపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు సీఐ ప్రేంకుమార్ తెలిపారు. ఓ పత్రిక లోగోతో తప్పుడు వార్తాకథనాన్ని మార్ఫింగ్ చేసిన వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసినట్టు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సురేందర్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రేంకుమార్ తెలిపారు.

సీఆర్టీ ఫలితాలు విడుదల

ఆసిఫాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న కాంట్రాక్టు రిసోర్స్ టీచర్స్ ఫలితాలు విడు దల చేసినట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 1,137 మంది పరీక్ష రాయగా వీరికి సంబంధించిన ఫలితాలు ఆన్‌లైన్‌తో పాటు కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

నేడు జిల్లాకు మందకృష్ణ మాదిగ రాక

ఆసిఫాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించే జిల్లా సన్నాహక సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు వీహెచ్‌పీఎస్ నాయకులు ఇస్లాంబీన్ హసన్ అన్నారు. స్థానికంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులు, వృద్ధు లు, వింతంతులకు పెన్షన్ పెంపుపై ఒత్తిడి తేడవానికి ఈ నెల 13న నిర్వహించే చలో హైదరాబాద్‌కు సన్నాహకంగా సోమవా రం జిల్లా సన్నాహక సభ నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్ర మంలో పెద్ద సంఖ్యలో దివ్యాంగులు, వృద్దులు, వితంతువులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మందకృష్ణ సభను విజయవంతం చేయాలి

కౌటాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం లో సోమవారం నిర్వహించే మందకృష్ణ మాదిగ పాల్గొనే సభను పెన్షనర్లు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సత్యనారాయణ కోరారు. మండలంలోని వీర్దండి గ్రామంలో ఆదివారం ఆయన మాట్లాడారు. సభకు మండలం నుంచి దివ్యాంగులు, వృద్ధులు, ఇతర పింఛన్‌దారులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో విఠల్, రాజేష్, సదాశివ్, కొండయ్య, విమలాబాయి నాయకులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

బెజ్జూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్స వాన్ని ఈ నెల 9న ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ సంఘం మండలాధ్యక్షుడు తిరుపతి కోరారు. మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఆదివారం నిర్వహించిన సన్నా హక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సారి ప్రతి ఆదివాసీ గ్రామాల్లో ఆదివాసీలు భారీగా తరలి వచ్చి ఆదివాసీ దినోత్సవాన్ని పండగలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రాములు, సకారాం, శంకర్, సత్తయ్య, మల్లేష్, అమృత, మహేష్, బక్కయ్య, శ్యాంరావు, వెంకటేష్, బానయ్య, భీంరావు, గంగారాం, రమేష్, బి.రమేష్ మధునయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

దహెగాం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం బీబ్రా గ్రామ సమీపంలో ఆదివారం తనిఖీలు నిర్వహిస్తుండగా ఏనిమిది లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. తనిఖీలు చేపడుతున్న సమయంలో మర్రిపల్లి గ్రామానికి చెందిన దరావత్ తారాచంద్ ద్విచక్ర వాహనంపై గుడుంబా తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. గుడుంబాతో పాటు ద్విచక్ర వాహనంను పట్టుకుని తారాచం ద్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న గుడుంబా విలువ రూ.3.500 ఉంటుందని తెలిపారు. గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దాడుల్లో మధు, విజయ్, మహ్మద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు నమోదు

దహెగాం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేర్వేరు గ్రామాలకు చెందిన ఎనిమిది మంది వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. పంచాయతీ విషయంలో మొట్లగూడ గ్రామానికి చెందిన కనక పాపయ్యను ఎనిమిది మంది వ్యక్తులు కులంపేరుతో దూషిం చినట్లు ఎస్సై తెలిపారు. మొట్లగూడ గ్రామానికి చెందిన ఏడు గురు వ్యక్తులు చౌదరి సంజీవ్, కిర్మిడి గంగాధర్, చౌదరి బాన య్య, జిల్లెడ వెంకటేష్, ఎండీ ఇర్ఫాన్, చౌదరి రాకేష్, వగాడి శంకర్, ఖర్జీ గ్రామానికి చెందిన సురేష్‌లపై ఆదివారం ఎస్సీ ఎ స్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అటవీ సంపదను కాపాడాలి



కందకాలను పరిశీలిస్తున్న సీసీఎఫ్ శాంతారాం

చింతలమానేపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అటవీ సంపద అందరి బాధ్యత అని సీసీఎఫ్ శాంతారాం అన్నారు. మండలంలోని దిందా, బండెపల్లి అటవీ ప్రాంతంలో తవ్వుతున్న కందకాలను జిల్లా అటవీ అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఇక్కడి ప్రాంతంలో భూ ములను రైతులు పోడు వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తుండగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది భూ సేకరణ జరుగుతుంది. ఇందులో భాగం గానే అటవీ అధికారులు అటవీ భూ విస్తీర్ణాన్ని సేకరించేందుకు కందకాలు తవ్వుతున్నారు. ఇక్కడి పరిస్థితిని, అటవీ సంపదను సిబ్బందిని అడిగి తెలుసుకు న్నారు. అనంతరం సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రెవాల్, కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ సుశాంత్ బోబాడే, కర్జెల్లి రేంజ్ అధికారి సుభాష్, కౌటాల సీఐ సంతోష్‌కుమార్, చింతలమా నేపల్లి ఎస్సై నరేష్ ఉన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండ లంలోని ఇటిక్యాలపహాడ్ గ్రామాన్ని పీసీసీఎఫ్ శాంతారాం సంద ర్శించారు. గ్రామంలో రిజర్వు ఫారెస్టు భూముల విస్తీర్ణంపై ఇన్‌చార్జి ఎఫ్ఆర్వోను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో ఇటిక్యాల పహా డ్ అటవీ ప్రాంతం వన్యప్రాణులకు రక్షణగా ఉంటుందన్నారు. ఆయన వెంట అటవీ శాఖాధికారులు తదితరులు ఉన్నారు.

ఒగ్గు పూజారుల జోగు కార్యక్రమం

కౌటాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలోని శిర్షా గ్రామంలో ఆదివారం ఒగ్గు పూజారులు శ్రావణ మాసం సందర్భంగా ఇంటింటికి వెళ్లి జో గు పట్టారు. ఇలా సేకరించిన జోగు (బియ్యం)తో మల్లికార్జున స్వామికి బో నం పోసి మొక్కులు తీర్చుకుంటామని తెలిపారు. ఇది తరతరాల నుంచి వస్తు న్న ఆచారమని ఒగ్గు పూజార్లు తెలిపా రు. కార్యక్రమంలో ఒగ్గు పూజారులు శ్రీశైలం, బీరయ్య, పోచయ్య, రాజులు, కొ మురయ్య, తిరుపతి, రాము, చందు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాలువారుతున్న శివపల్లి జలపాతం

చింతలమానేపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండంలోని శివపల్లి జలపాతం జాలువారు తూ ఆకట్టుకుంటోంది. వర్షాకాలం కావడంతో అటవీ ప్రాంతాలు ఆకుపచ్చని దుప్పటి కప్పుకున్నట్లు కనువిందు చేస్తున్నాయి. కొండకోనల నడుమ దట్టమైన అటవీ ప్రాంతం గుండా వెళ్తే మూడు కిలో మీటర్ల మేర కాలినకడన వెళ్తే ఇక్కడి ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. చింతలమానేపల్లి మండలంలోని గూడెం గ్రామ పంచాయతీ శివపల్లి గ్రామం మీదుగా మూడు కిలో మీటర్ల మేర కాలినడక అటవీ ప్రాంతంలోకి వెళ్తే కొండకోనల నడుమ నుంచి సెలయేరులా నీరు జలువారడం, గలగల సవ్వడితో శబ్దాలు రావడం, చుట్టు అటవీ ప్రాంతంలో పచ్చని దుప్పటి కప్పుడకున్నట్లు కనువిందు చేయడంతో సందర్శకులు అక్కడి ప్రాంతాన్ని సందర్శించేందుకు తరలి వెళ్తున్నారు. తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్రకు నుంచి సందర్శకులు ఎక్కువగా వచ్చి ఆస్వాదిస్తున్నారు. సందర్శకుల కోసం సౌకర్యాలు కల్పించేలా అధికారులు చూడాలని వారు కోరుతున్నారు.



శివపల్లి జలపాతం నీటి సవ్వడులు

మండలంలో వరి నాట్లు ముమ్మరం



పొలంలో జంబు కొడుతున్న రైతు

కౌటాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో వరి నాటు పనులు ముమ్మరంగా కానసాగుతున్నాయి. నెల రోజులుగా వర్షాలు లేక ఎండిపోతున్న సమయంలో కురిసిన వర్షం చేలకు జీవం పోసింది. దీంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు ముందుగా ప్రవేశిం చి తొలకరి వర్షాలు పడడంతో రైతులు పత్తి, కంది, తదితర పంట లు వేశారు. వని నార్లు పోశారు. ఆ తరువాత వర్షాలు లేక పోవ డంతో బావులు, బోరుబావుల కింద ఉన్న వారు ఎలాగోలా పంట లను కాపాడుకున్నారు. నీటి వనతి లేని వారు ప్రత్యా మ్నాయ ఏర్పాట్లతో నీరు పోసి కాపాడుకున్నారు. అయినప్పటికీ నెల రోజులు గా వర్షాలు కురవక పోవడంతో పంటలు ఎండిపోయే దశలో వర్షాలు సమృద్ధిగా పడడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

నిండిన చెరువులు..

కౌటాల మండలంలోని చెరువులు నిండుకు న్నాయి. కొన్ని చెరువులు మత్తడి పారగా మరికొన్ని మరో నాలుగైదు ఫీట్లు చేరి తే మత్తడి పారే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలు నీరు చేరడంతో వ్యవసాయ సాగు పనులు ఊపందుకున్నాయి. తొలకరి వర్షాలకు వేసిన పం టలు ఇప్పుడు పూత దశలో ఉన్నాయి. పత్తి, కంది తదితర పంటల్లో కలుపు తీసి ఎరువులు వేస్తున్నారు. అలాగే పత్తి పంటకు క్రిమి సంహార మందులు పిచికారి చేస్తున్నారు. మరో వైపు వరి నార్లు పోసిన రైతులు నాట్లు వేసే పనుల్లో బిజీ అ య్యారు. పొలాలు దున్నుకుంటున్నారు. జంబు కొడుతూ సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మరి కొందురు రైతులు వరి నాట్లు సైతం పూర్తి చేశారు.

వర్షాలు పంటలకు ప్రాణం పోశాయి..



వారం రోజుల పాటు ఏకదాటిగా కురిసిన వర్షాలు పంటలకు ప్రాణం పోశాయి. కొద్ది రోజులుగా వర్షాలు లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో వర్షాలు పడడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరింది. పత్తి, కంది పంటలో కలుపు తీసి ఎరు వులు వేసుకుంటున్నారు.. ఆగస్టు చివరి వరకు నాట్లు వేసుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

- మడావి విజయ్, రైతు, వీర్దండి

తెగిన చెరువు మత్తడి



మత్తడి తెగి వృథాగా పోతున్న నీరు

సిర్పూర్(టి), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రుద్రారం గ్రామంలోని చెరువు మత్తడి ఇటీవల కురిసిని భారీ వర్షాలకు తెగిపోయింది. దీంతో చెరువులో నీరు వృధాగా పోతున్నది. చెరువు కింద సుమారు 200 ఎక రాల్లో ఆయకట్టు సాగవుతోంది. అధికారులు స్పందించి తెగిపోయిన మత్తడికి మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

అమ్మవారికి సారె

రెబ్బెన, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరానగర్‌లో దుర్గాదేవి ఆల యంలో ఆదివారం మహిళలు అమ్మవారికి సారె కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా సారె పోసి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఒడి బియ్యాన్ని పోశారు. ఆలయ ప్రధాన అర్చకుడు దేవర వినోద్ భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

40 శాతం లాభాల వాటా చెల్లించాలి



సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో శాశ్వత, కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు 40 శాతం లాభాల వాటా చెల్లించాలని ఆదివారం టీఎస్‌టీయూసీ ఆధ్వర్యంలో సీఎండికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్ మాట్లాడుతూ సింగరేణికి ప్రగతికి కృషి చేస్తున్న సింగరేణి ఉద్యోగులకు 40 శాతం లాభాల వాటా చెల్లించాలన్నారు. లాభాల వాటా విషయం పై వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నూతన ట్రాన్స్‌ఫర్ పాలసీ విధానాన్ని రద్దు చేసి సొంతింటి పథకం కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌టీయూస్ రాష్ట్ర అధ్యక్షులు ఎంకే బోస్, నాయకులు నారాయణ, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్, మల్లయ్య, స్వామి పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్త



రాజమణి (ఫైల్)

జైపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్వ గ్రామానికి చెందిన గోదారి రాజమణి(48)ని ఆమె భర్త గోదారి రాజయ్య కర్రతో కొట్టి హత్య చేసినట్లు జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం రాజమణి అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తుంది. ఆమె భర్త ఇందారం ఐకే 1ఏ గనిలో కార్మికుడిగా పనిచేసి 2020లో ఉద్యోగ విరమణ పొందాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసై పెన్షన్ డబ్బులు ఖర్చు చేయడంతో పాటు భార్య జీతం డబ్బులు అడిగేవాడు. భార్య జీతం ఇవ్వకపోవడంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున దంపతుల మధ్య డబ్బుల కోసం గొడవ జరగగా కోపోద్రిక్తుడైన రాజయ్య భార్య రాజమణిని కర్రతో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ మృతదేహాన్ని పరిశీలించారు. రాజమణి కూతురు పూజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి

మంచిర్యాల జిల్లా కేంద్రంలో విషాదం



శివాని(ఫైల్)

మంచిర్యాలక్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం హమాలీవాడకు చెందిన మిట్టపల్లి శివాని (17) ఆదివారం వరంగల్ ఓ ప్రైవేటు కళాశాల వసతి గృహంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం జిల్లా కేంద్రంలో కలకలం రేపింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలి తండ్రి మిట్టపల్లి కుమార్ పేపర్ ఏజెంటుగా పని చేస్తున్నాడు. కుమార్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు శివాని వరంగల్‌లోని ఓ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆదివారం ఉదయం శివాని మృతి చెందినట్లు కళాశాల యాజమాన్యం ఫోన్ ద్వారా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన తల్లిదండ్రులు కవిత-కుమార్‌లు అక్కడకు వెళ్లేలోపే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. ఘటన స్థలంలో ఒక సూసైడ్ నోటు లభ్యమైంది. శివాని మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. శివాని మృతి పట్ల తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పీడీఎస్‌యూ నాయకులు డి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థిని మృతిపై కళాశాల యాజమాన్యం నుంచి ఇప్పటి వరకు స్పందన రాలేదని, విద్యార్థిని కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆలస్యమైతే ఆబ్సెంటే..

- ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నిషన్ హాజరు ప్రారంభం
- సమయపాలన కోసం సర్కారు ప్రత్యేక యాప్
- పాఠశాల ఆవరణలోనే పని చేసే విధంగా రూపకల్పన



సిర్పూర్(టి)లో ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో హాజరు నమోదు చేస్తున్న ఎంఈవో వేణుగోపాల్(ఫైల్)

కౌటాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు శుక్రవారం నుంచి ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం(ఎఫ్‌ఆర్‌ఎస్) హాజరు ప్రారంభించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించే విధంగా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోంది. హాజరును వారే నేరుగా ఆన్ లైన్‌లో నమోదు చేసుకునే విధంగా ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సంబంధిత ఉపాధ్యాయుడి సెల్‌ఫోన్‌లోనే టీజీఎఫ్ ఆర్ ఎస్ అనే యాప్‌ను ఇన్‌స్టాల్‌చేసి వారి హాజరు నేరుగా ఆన్‌లైన్‌లోనే పంపించేందుకు ఏర్పాట్లు చేసింది. 2023 సెప్టెంబరు నుంచి పాఠశాలల్లోని విద్యార్థులకు ఇప్పటికే ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను ఉపయోగించి విద్యార్థుల హాజరు శాతాన్ని నమోదు చేస్తుండగా గతేడాఇ ఆర్జేడీ, డీఈవో కార్యాలాయల్లో ఈ యాప్ ద్వారా హాజరు ప్రారంభమైంది. సంబంధిత పాఠశాల ప్రాంగణం నుంచి మాత్రమే ఉపాధ్యాయులు వారి ఫేస్ రికగ్నిషన్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

● నమోదు ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలోని ఉపాధ్యాయుల సమయపాలన కోసం కొత్తగా ప్రవేశ పెట్టిన యాప్ టీజీఎఫ్‌ఆర్‌ఎస్ సంబంధిత ఉపాధ్యాయుడి స్మార్ట్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేస్తారు. మొదటగా యాప్‌లో సంబంధిత ఉపాధ్యాయుడి వివరాలతో రిజిస్టర్ చేసుకుని లాగిన్ కావాల్సి ఉంటుంది. యాప్ ఇన్‌స్టాలేషన్ సమయంలోనే సంబంధిత స్కూల్ ఆవరణ లాంగి ట్యూడ్, లాటిట్యూడ్‌లను టెక్నీషియన్ అప్‌లోడ్ చేస్తారు. ఒకసారి లాగిన్ అయిన తరువాత యాప్ నిరంతరం వినియోగించవచ్చు. ఇక ఉపాధ్యాయుడు ఉదయం నిర్దేశిత సమయానికి కార్యాలయంలోకి వచ్చిన తరువాత యాప్‌ను ఓపెన్‌చేసి క్లాక్‌ఇన్ అనే ఆప్షన్‌పై నొక్కితే సదరు ఉపాధ్యాయుడు వచ్చిన సమయం ఆన్ లైన్‌లో సంబంధిత పర్య వేక్షణాధికారికి చేరుతుంది. అలాగే ఆఫీస్‌లో పని సమయం ముగిసిన తరువాత క్లాక్ అవుట్ అనే ఆప్షన్‌పై టచ్ చేస్తే ఉపాధ్యాయుడి కార్యాలయాన్ని విడిచి వెళ్లే సమయాన్ని పనిచేసిన గంటలను లెక్కించి తిరిగి సంబంధిత పర్యవేక్షణాధికారి ఆన్‌లైన్‌లో చేరుతుంది.

● పకడ్బందీగా యాప్..

టీజీఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను పకడ్బందీగానే తయారు చేసినట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయుడు ఎవరైనా నిర్దేశిత సమయానికి స్కూల్‌కు రాకుండా ఇంటి నుంచి గాని మరేదైనా ప్రదేశం నుంచి గానీ యాప్‌ను ఓపెన్ చేస్తే అది సంబంధిత స్కూల్ బయట ఉన్నారని సంక్షిప్త సందేశాన్ని ఇస్తుంది. ఉద్యోగులు తమ పాఠశాల ఆవరణలోకి వచ్చిన తరువాతనే క్లాక్ ఇన్ గానీ, క్లాక్ అవుట్ అనే అప్షన్లు యాప్‌లో పని చేస్తా యి. స్కూల్ ఆవరణకు సంబంధించిన లాంగిట్యూడ్, లాటిట్యూడ్‌లను యాప్‌లో పొందుపర్చడంతో సంబంధిత ఆవరణలో మాత్రమే ఆ యాప్ పని చేస్తుంది. కాగా విద్యాశాఖలోని అన్ని కార్యాలయాల్లో దశలవారీగా ఈ యాప్‌ను అమలు చేయనున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో విద్యార్థుల హాజరును ఫేస్ రికగ్నిషన్‌యాప్ ద్వారానే ఆన్‌లైన్‌లో పంపిస్తున్నారు. ఇది2023 సెప్టెంబరు నుంచి ప్రారంభమైంది. గతేడాది సెప్టెంబర్ నుంచి డీఈవో, ఆర్జేడీ, ఎంఈవో ఇతరాత్ర కార్యాలయాల్లో టీజీఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌ను అమలు చేస్తున్నారు. ఇప్పుడు పాఠశాలల్లో ఈ విధానాన్ని ఉపాధ్యా యులు, సిబ్బందికి అమలు చేస్తున్నారు.



ఆసిఫాబాద్‌లో ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో ఉపాధ్యాయుల హాజరు నమోదు(ఫైల్)

ఐక్య పోరాటాలు

శ్రామిక మహిళల హక్కుల కోసం



మాట్లాడుతున్న శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ రమ

కాగజ్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రామిక మహిళల హక్కుల కోసం ఐక్య పోరాటాలకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ఎస్‌వీ రమ అన్నారు. కాగజ్‌నగర్‌లో ఆదివా రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో సీఐటీయూ ఐదు రాష్ట్ర మహాసభలు మెదక్ జిల్లాలో నిర్వహించనున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో మహిళ కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను నిర్ణయించుకునేందుకు సమన్వయ కమిటీ రాష్ట్ర సదస్సు అక్టోబరు 5, 6 తేదీల్లో కాగజ్‌నగర్‌లో నిర్వహిస్తామని తెలిపారు. ఆగస్టు 3న ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్టు వివరించారు. మహిళ కార్మికులను సంఘటితం చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్మిక వర్గం అన్ని విధాల సహాయ సహకారాలు అందజేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర యూటీ ఎఫ్ రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక ఉపాధ్యాయుల ఐక్యతకి యూటీఎఫ్ కట్టుబడి ఉన్నదని తెలిపారు. శ్రామిక మహిళ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగురు రాములు మాట్లాడుతూ శ్రామిక మహిళ రాష్ట్ర సదస్సును నిర్వహించడానికి ముందుకు వచ్చిన కుమురంభీం జిల్లా సీఐటీయూ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

భద్రత ప్రమాణాలు మెరుగు పరుచాలి

సౌత్‌సెంట్రల్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ టీఆర్ కన్నన్

కాసిపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ అదాని కంపెనీ మైన్స్‌లో భద్రత ప్రమాణాలు మరింత మెరుగు పరుచాలని సౌత్‌సెంట్రల్‌జోన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ టీఆర్ కన్నన్ అన్నారు. దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలోని మైన్స్ ఏరియాలో ఆదివారంఆయన పర్యటించారు. పని స్థలాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ ఉత్పత్తి సాధనలో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని కార్మికులకు సూచించారు. కార్మికులు భద్రత, రక్షణ చర్యల పట్ల యాజమాన్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. కార్మికులకు పనులపై మెరుగైన శిక్షణ ఇచ్చి వారి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు యాజమాన్యం శిక్షణ తరగతులను నిర్వహించాలన్నారు. సురక్షిత ఆపరేటింగ్ విధానాలను పాటిస్తూ ప్రమాద రహిత గనులుగా తీర్చిదిద్దడంలో యాజమాన్యంతో పాటు కార్మికులు ఐక్యంగా పని చేయాలన్నారు. అనంతరరం ఓరియంట్ కంపెనీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి కార్మికుల సంక్షేమం, అభివృద్ధిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో గనుల భద్రత డైరెక్టర్ హైదరాబాద్ రీజియన్ అశోక్ కుమార్, టీఎస్‌ఎండీసీ లిమిటెడ్ అధికారి నాగేశ్వర్ రావు, ఓరియంట్ సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ బాలగిరిధర్, రాజశేఖర్ రెడ్డి, ఎన్‌పీ సహారే, హెచ్‌ఆర్‌జీఎం ఆనంద్ కులకర్ణి, ఓరియంట్ సిమెంట్ కంపెనీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కంకర తేలిన రోడ్లు

- రాకపోకలకు వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేపట్టాలని ప్రజల వినతి



కంకర తేలిన పంగిడిమాదర, లింగాపూర్ రోడ్డు

తిర్యాణి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లపై కంకర తేలి ఉండడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లపై అధిక లోడ్‌తో ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండడంతో అధ్వానంగా మారుతున్నాయి. మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధి 134 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. కాగా కనీస రోడ్డు సౌకర్యం లేని గ్రామాలు 40 శాతంకు పైగా ఉన్నాయి. అంతంత మాత్రంగా ఉన్న రోడ్లపై అక్రమార్కులు అధిక లోడ్, అక్రమ రవాణా చేస్తుండడంతో అవి సైతం పూర్తిగా పాడవుతున్నాయి. అయినప్పటికీ అక్రమ రవాణాపై అధికారులు మామూలుగా తీసుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. లింగాపూర్, సిర్పూర్(యూ), జైనూరు మండలాల్లో ఇసుక నిలువలు తక్కు వగా ఉండడంతో అక్కడి వ్యక్తులు ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట లోని వాగు నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా పంగిడిమాదర మీదుగా లింగాపూర్‌కు తరలిస్తున్నారు. పంగిడిమాదర- లింగాపూర్ ప్రధాన రహదారి తారు లేచి ఉండడం, దీనికి తోడు రోజుకు 20 నుంచి 50 ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు అధ్వానంగా మారింది. కొంత మంది ట్రాక్టర్ యజమానులు ఎలాంటి అనుమతి లేకుండానే ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం. దీంతో పంగిడిమాదర నుంచి దాంపూర్, కొటగాం, లింగాపూర్, సిర్పూర్ (యు) గ్రామాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు అదుపు తప్పి కింద పడడంతో గాయాలైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. రాత్రి పూట ఈ రోడ్లపై ప్రయాణించడం సహసమనే చెప్పుకోవచ్చు. అత్యవసర సమ యంలో అంబులెన్స్ కూడా నడిచే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఆదివాసీలకు రోడ్డు కష్టాలు తప్పడం లేదు. ఉన్నతాధికారులు, నాయకులు స్పందించి తారు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి..



తిర్యాణి నుంచి పంగిడి మాదర మీదుగా లింగాపూర్‌కు కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లడం లేదు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టాలి. ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట వాగు నుంచి ఇసుకను పంగిడి మాదర మీదుగా లింగాపూర్‌కు తరలించకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

– సుభాష్, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు

నిధులు రాక.. పనులు సాగక..



అసంపూర్తిగా ఐకేపీ కమ్యూనిటీ భవనం

దండేపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఐకేపీ కమ్యూనిటీ హాలు నూతన భవననిర్మాణానికి నిధులు రాక పనులు ముందుకు సాగడం లేదు. దండేపల్లిలో సహకార సంఘం ప్రధాన కార్యాలయం పక్క గల ఐకేపీ కమ్యూనిటీ భవనం కోసం ఏడేళ్ల క్రితం రూ. 32లక్ష నిధులు మంజూరు చేసి పనులు చేపట్టారు. ఈ భవనం నిర్మాణ పనులు ఓపెన్ స్లాబ్ వరకు సంబంధిత కాంట్రాక్టర్లు చేపట్టారు. మిగతా పనులు చేపట్టేందుకు నిధులు కొరత ఏర్పడడంతో ఆపనులు మధ్యలోనే కాంట్రాక్టర్లు నిలిపివేశారు.

కొనసాగుతున్న రోడ్డు పనులు

సిర్పూర్(టి), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జక్కాపూర్, హుడ్కిలికి వెళ్లే ప్రధాన రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో రైల్వే స్టేషన్‌తో పాటు జక్కాపూర్, హుడ్కిలి గ్రామాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి మరమ్మతు పనులు ప్రారంభించారు. పనులు త్వరగా పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.



రోడ్డు పనులు చేపడుతున్న సిబ్బంది

అందుబాటులోకి నస్పూర్ ఏటీసీ

● ఉపాధి కోర్సులపైనే దృష్టి ● సెప్టెంబరులో తరగతులు మొదలయ్యే అవకాశం



ఏసీటిలో బిగించిన యంత్రాలు

నస్పూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేందుకు నూతన కోర్సులను ప్రవేశపెట్టింది. నస్పూర్‌లో దాదాపు ఐదు కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఉపాధి కల్పన శిక్షణా శాఖ అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ (పారిశ్రామిక శిక్షణ సంస్థ-ఐటీఐ, ఏటీసీ) పనులు వేగవంతంగా తుది దశకు చేరుకున్నాయి. ప్రభుత్వ ఐటీఐను అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌లుగా (ఏటీసీ) మార్పు చేసి నూతన కోర్సులను ప్రవేశపెట్టింది. తరగతి గదులు పూర్తి కాగ రోబోటిక్, ఎలక్ట్రికల్, లారీ విడిభాగాల యూనిట్ల యంత్రాల బిగించారు. మరికొన్ని యూనిట్ల యంత్రాలను ఈ నెల చివరికల్లా పూర్తిగా బిగించి ట్రయల్ చేసి అప్పగించనున్నారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు అధునాతన, సాంకేతిక శిక్షణను ఈ కేంద్రంలో సెప్టెంబరు మొదటి, రెండవ వారాల్లో పూర్తి స్థాయిలో తరగతులు ప్రారంభించడానికి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఐటీఐ-ఏటీసీలో తొలి విడతగా చేపట్టిన అడ్మిషన్ల ప్రక్రియ గత నెల 31తో ముగిసింది. అన్‌లైన్ దరఖాస్తులు చేసిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. సీట్ల అలాట్‌మెంట్ల ప్రక్రియ ఈ నెల 5వ తేదీలోగా పూర్తి కానుంది.



నస్పూర్ ఏటీసీ భవనం

కొత్త కోర్సులు ఇవే..

నస్పూర్ ఏర్పాటు చేసే ఏటీసీలో ఈ ఏడాది నుంచి ఆరు కొత్త కోర్సులు ప్రవేశ పెట్టారు. టాటా టెక్నాలజీ లిమిటెడ్ భాగస్వామ్యంతో కొత్త కోర్సులు కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. నూతన కోర్సుల ఏర్పాటుతో ఐటీఐకి పూర్వ వైభవం సంతరించుకోనుంది. నస్పూర్ ఏటీసీ ద్వారా సంవత్సరం, రెండు సంవత్సరాలకు సంబంధించి 172 సీట్లు భర్తీ కొరకు అన్‌లైన్ ద్వారా దరఖాస్తుల గడువు జూలై 31తో ముగిసింది. ఇందులో ఏడాది కోర్సులు ఇండస్ట్రియల్ రోబోటెక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్-40 సీట్లు, మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేటిక్-40 సీట్లు, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్-20 సీట్లు. రెండేళ్ల కోర్సులు అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్-24 సీట్లు, బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫయర్-24 సీట్లు, మెకానిక్ ఎలక్ట్రానిక్ వెహికల్-24 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 5వ తేది నాటికి సీట్ల కేటాయింపులు జరుగుతాయి. ప్రస్తుత పారిశ్రామిక రంగానికి అనుగుణంగా ఆరు నూతన కోర్సులను అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం శ్రీరాంపూర్ కొనసాగుతున్న ఐటీఐ కోసం ఇక్కడ 35 గుంటల భూమిని కేటాయించారు. ఏటీసీ శిక్షణ కేంద్రం పక్కనే ఐటీఐ భవన నిర్మాణానికి అధికారులు జీ+2 భవన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశారు.

సీట్ల కేటాయింపు తర్వాత తరగతులు..

ఏటీసీలో సీట్ల భర్తీ కోసం అన్‌లైన్ ద్వారా విద్యార్థులు దరఖాస్తులు చేశారు. గత నెల 31తో ముగిసింది. విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. 5వ తేదీన సీట్ల అలాట్‌మెంట్ల కేటాయింపులున్నాయి. సీట్ల భర్తీ తర్వాత తరగతలు మొదలు అవుతాయి. వర్క్‌షాప్‌లో కొన్ని యంత్రాల బిగించారు. మరికొన్ని పనులు పూర్తి కావాల్సి ఉన్నది.

– సుజాత, ఐటీఐ ప్రిన్సిపాల్

ప్రతీ వ్యక్తి చదువుకోవడం ప్రాథమిక అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉషారాణి

కాసిపేట, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి చదువుకోవడం ప్రాథమిక అవసరం కాబట్టి అందరూ అక్షరజ్ఞానం కలిగి ఉండాలని వయోజన విద్య శాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్. జి. ఉషారాణి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన వందరోజుల్లో వందశాతం అక్షరాస్యత కార్యక్రమానికి ఆమె అతిథిగా హాజరై మాట్లాడారు. మానవ వనరుల అభివృద్ధి దేశాభివృద్ధిలో కీలకభూమిక పోషిస్తుందన్నారు. మానవ వనరుల అభివృద్ధి ఆదేశ అక్షరాస్యత ప్రగతిపై ఆధారపడి ఉంటుందన్నారు. అందరికి చదువుకునే అవకాశాన్ని కల్పిస్తూ కాసిపేట మండలంలో వంద రోజుల్లో వందశాత అక్షరాస్యత సాధించడానికి కృషి చేసిన డీఆర్‌పీలు, సెర్ప్ సిబ్బందిని ఆయన అభినందించారు. అభ్యాసకులతో స్వయంతో మాట్లాడుతూ వారి పేర్లను పలకపై రాయించి చదివించారు. అలాగే చిన్న చిన్న వ్యాఖ్యలను సైతం చదివించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఉల్లాస్ కార్యక్రమం గురించి అందరికీ వివరించారు. ఓపెన్ స్కూల్ విధానంలో వయోజనులకు ఓపెన్ 10, ఇంటర్‌మీడియట్ చదువుకునే అవకాశం ఉంది. ఆసక్తి ఉన్న వారు ఈనెల 18లోగా ఓపెన్‌స్కూల్ కేంద్రాల్లో అప్లికేషన్ పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి అజ్మీర పురుషోత్తం నాయక్, క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, బీఆర్‌పీలు బండ శాంఖారి, సుమన్, ఏపీఎం రాజ్‌కుమార్, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

‘లేదాళ్ల’ ఒక మానసిక శాస్త్రవేత్త

అక్షయ సాహితీ ప్రధానకార్యదర్శి చక్రవర్తి

లక్షెట్టిపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కవి లేదాళ్ల రాజేశ్వర్‌రావు నిజానికి ఒక గొప్ప మానసిక శాస్త్రవేత్త అని అక్షయ సాహితీ ప్రధానకార్యదర్శి వేనంక చక్రవర్తి అన్నారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో కవులు ఏర్పాటు చేసిన అక్షర సాహితీ సృజన ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేశ్వర్‌రావు ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ వృత్తి పట్ల తనకున్న అంకితభావాన్ని పిల్లలపై తనకున్న ప్రేమను తెలియజేస్తూ రాసిన రంగుపూల ముఖాలు కవితా సంపుటిని కవుల సమక్షంలో ఆవిష్కరించి వినిపించారు. తాను రాసిన కవిత ఒక మానసిక శాస్త్రవేత్తలా మనసు లోతుల్లోకి వెలుతుందని కొనియాడారు. ఈకార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు నూటెంకి రవీంద్ర, కవులు లేదాళ్ల రాజేశ్వర్‌రావు, ముత్యం మల్లేష్, పురం సుధాంశ్ పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం



కొత్తపల్లిలో రోడ్డు పక్కన డ్రైనేజీ లేక నిల్వ ఉన్న మురుగు నీరు



భీమారంలోని బీసీ కాలనీలో రోడ్డు పక్కన నిల్వ ఉన్న మురుగు నీరు

- పట్టించుకోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం

భీమారం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీకాలనీల్లో, కొత్తగూడెం, వివిధ గ్రామాల్లో పారిశుధ్యం పడ కేసింది. మురుగు మట్టిచేరి నాలాల్లో దుర్గంధం నిండుకుపోయి ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టకపోడంతో ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు తగుచర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో కిందిస్థాయి సిబ్బంది మాత్రం అధికారుల ఆదేశాలను అటు విని ఇటు వదిలేస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. నాళాల్లో మురుగు పేరుకుపోయిందని, పిచ్చి మొక్కలు, గడ్డితో నిండిపోయాయని పంచాయతీ కార్యదర్శులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటు న్నారు. ముఖ్యంగా దళిత వార్డుల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో మురికి కాలువలు మురుగుతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతుందని పేర్కొంటున్నారు. ప్రతివారం మండలస్థాయిలో ఉన్నతస్థాయి అధికారులు గ్రామస్థాయి అధికారులకు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను పరిశీలించి సమావేశాలు నిర్వహిస్తున్నా కిందిస్థాయి అధికారులు మాత్రం పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేస్తు న్నారు. భీమారం గ్రామంలోని కొత్తగూడెం ఎస్సీ కాలనీలో కొన్నినెలల నుంచి పారిశుధ్య పనులు చేయకపోవడంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని మండల కార్యాలయాలకు వెళ్లి అధికారులకు చెప్పినా తమకాలనీలో ఇప్పటి వరకు పారిశుధ్య పనులు చేయలేదని ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లుతూ దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయని, రోగాల బారిన పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. అలాగే మండల కేంద్రంతో పాటు, పోలంపల్లి, ఆరేపల్లి, మద్దికల్, ఎల్కేశ్వరం, కొత్తపల్లి, బూగురుపల్లి, ధర్మారం, నర్సింగాపూర్, కాజీపల్లి, దాంపూర్ గ్రామాల్లో సైతం పారిశుధ్య పనులు గతంలో సర్పంచుల కాలంలో నిర్వహిం చేవారని, ప్రస్తుతం అడపాదడపా నిర్వహిస్తున్నారని దీంతో పారిశుధ్యం పేరుకుపోతోందని ప్రజలు పేర్కొంటున్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని, ట్యాంకులను శుభ్రం చేయడం లేదని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధి కారులు స్పందించి కిందిస్థాయి సిబ్బంది పారిశుధ్య పనులు చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్య పనులు చేపట్టడం లేదు..

- భూపెల్లి రాజన్న, కొత్తగూడెం కాలనీ, భీమారం

తమ కాలనీలో సుమారు 250మంది నివాసం ఉంటాం. మూడు వార్డులు ఉన్నాయి. కాలనీల్లోని నాలాల్లో మురుగు, చెత్తా, చెదారం పేరుకుపోయింది. పిచ్చి మొ క్కలతో నాలాలు కనబడకుండా పోయాయి. తమ కాలనీల్లో దుర్గంధం వెదజల్లుతోంది. ఈవి షయం అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. కాలనీ ప్రజలు దోమలు, ఈగలతో రోగాల బారిన పడే అవకాశాలున్నాయి. వెంటనే పారిశుధ్య పనులను నిర్వహించాలి.

గ్రామస్థాయి అధికారులను అప్రమత్తం చేస్తాం ..

- సతీష్‌రెడ్డి, ఎంపీవో

గ్రామస్థాయిలో కార్యదర్శులను అప్రమత్తం చేస్తూ పారిశుధ్య పనులను మల్టీ పర్పస్ వర్కర్లతో చేయించేలా చూస్తాం. గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా చేసేందుకు ప్రతి రోజు పారిశుధ్య పనులను పరిశీలిస్తున్నాం. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పారిశుధ్య సమస్యలుంటే తమకు నేరుగా ఫోన్‌లో సంప్రదిస్తే అక్కడ పారిశుధ్య పనులను చేయిస్తాం. మంచినీటి కుళాయిల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తూ క్లోరినేషన్‌చేయిస్తాం.

సింగరేణిలో ప్రమాదాలను అరికట్టాలి

కాసిపేట,ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలని కోరుతూ ఈనెల 6న చలో మందమర్రి జీఎం కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి ఒక ప్రకటనలో కో రారు. సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తిపై ఉన్న ఆరాటం కార్మికుల ప్రాణాలను కాపాడడంలో చూపెట్టడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రవేటీకరణ విధానాల మూలంగా సింగరేణి సంస్థలో పర్మినెంట్ కాంట్రాక్టు కార్మికులు వారి ప్రాణాలను కోల్పోతున్నారు. దీనిపై సింగరేణి యాజమాన్యం రక్షణ చర్యలను చేపట్టాలని కోరుతూ ఈనెల 6న జీఎం కార్యాలయం ముట్టడిని విజయవంతం చేసేందుకు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, డిగ్రీ పీజీ కళాశాలల్లో కాకతీయ విశ్వ విద్యాలయం దూర విద్య పీజీ, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కాంపెల్లి శంకర్ తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం 2025-26లో పీజీ, డిగ్రీ చేసేందుకు గాను ఈ నెల 11వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ పీజీలో ఎంఏ, ఎంకం, ఎంస్సీలో అన్ని సబ్జెక్టులను చదివేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఓపెన్ డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్లు ఉన్నాయని పేర్కొన్నారు. దూర విద్య ద్వారా పీజీ, డిగ్రీ చేయాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 9959269975 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మహాగర్జనను విజయవంతం చేయండి

కాసిపేట, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించతలపెట్టిన చేయూత పింఛన్ దారుల మహాగర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చెన్నూర్ సమ్మయ్య మాదిగ అన్నారు. ప్రభుత్వం పింఛన్లను సకాలంలో అందించడంలో విఫలమవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా పింఛన్లు పెంచి ఇవ్వాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 13న నిర్వహిస్తున్న సభకు వితంతువులు, మహిళలు, వికలాంగులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్కర శంకర్, గొడిశెల క్రాంతి, కాంపెల్లి వెంకటేశ్, లంక లక్ష్మణ్, దాసరి శంకర్, గొడిశెల క్రిష్ణ, చొప్పదండి కిషన్, వికలాంగుల నాయకులు నగురారపు సుమన్, తిరుపతి, పాల్గొన్నారు.

గాడి తప్పిన సింగరేణి పాలన

కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పరిపాలన గాడితప్పిపోయిందని, రాజకీయ జోక్యం పెరగడం వల్ల కార్మికుల హక్కులు హరించవేయబడుతున్నాయని మాజీ మంత్రి, టీబీజీకేఎస్ ఇన్‌చార్జి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం గోదావరిఖని టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో 9నెలల తరువాత జరిగిన మెడికల్ బోర్డు గందరగోళంగా ఉందన్నారు. మెడికల్‌బోర్డుకు పిలిచిన ఉద్యోగులలో 55మందికి గాను కేవలం 5గురిని మాత్రమే అన్‌ఫిట్ చేసి మైనింగ్ స్టాఫ్ ఉద్యోగులను సుటబుల్ జాబ్ అని చెప్పి జనరల్ అసిస్టెంట్లుగా మార్చడం ఏ సంకేతాలను ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికుల సమస్యల విషయంలో పూర్తిగా వైఫల్యం చెందాయని ఆయన ఆరోపించారు. కారుణ్య నియామకాల పేర గతంలో కేసీఆర్ వంద శాతం ఉద్యోగాలు ఇవ్వాలని కోరారని, అది మెడికల్ బోర్డుకు సాంకేతికంగా ఇబ్బంది కలించే విషయం కావడంతో 80 నుంచి 90 శాతం కార్మికులకు వారసత్వ ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఇలా బీఆర్‌ఎస్ ప్రభుత్వం 19వేల మంది వారసులకు ఉద్యోగాలు కల్పించిందని ఆయన చెప్పారు. ఇప్పటి పరిస్థితులను గమనిస్తే కారుణ్య నియామకాలను కనుమరుగుచేసే విధంగా ఉందన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగి టీబీజీకేఎస్ నాయకులను అక్రమ బదిలీలు చేస్తున్నారని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో రక్షణ చర్యలు కూడా వైఫల్యం చెందాయని, మందమర్రిలో జరిగిన ప్రమాదం ఇందుకు తాజా ఉదాహరణ అని చెప్పారు. కార్మిక సమస్యలను పరిష్కరించకుండా రాజకీయ జోక్యంతో యాజమాన్యం ఇలాంటి చర్యలనే కొనసాగిస్తే సింగరేణి వ్యాప్తంగా పోరాటాలకు సిద్ధమవుతామని కొప్పుల అన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గోదావరిఖని, మే 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో స్థానిక ఏరియా హాస్పిటల్‌లో ఆదివారం హైదరాబాద్ కేర్ ఆసుపత్రిచే సూపర్ స్పెషాలిటీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాల మేరకు కేర్ హాస్పిటల్ ప్రధానమైన అత్యున్నతమైన వైద్య బృందం కార్డియాలాజిస్ట్, న్యూరోలా జిస్ట్, మెడికల్ గాస్ట్రోలాజిస్ట్, యురోలాజిస్ట్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 400మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎస్ఓటూ జీఎం ఆంజనేయ ప్రసాద్ ఉన్నారు.

జోగాపూర్ యువతికి రెండు బంగారు పతకాలు



బంగారు పతకం అందుకుంటున్న తేజస్విని

నెన్నెల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోగాపూర్ గ్రామానికి చెందిన నికా డి తేజస్విని ఎమ్మెస్సీ అగ్రికల్చర్‌లో విశ్వవిద్యాలయ స్థాయిలో టాపర్‌గా నిలిచి రెండు బంగారు పతకాలను సాధించింది. ఆదివారం హైదరాబాదులోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య, ఐకార్ డైరెక్టర్ జనరల్ మంగీలాల్ జట్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకుంది. జగిత్యాల జిల్లా పొలాస వ్యవసాయ కళాశాలలో తేజస్విని ఎమ్మెస్సీ జెనెటిక్స్, ప్లాంట్ బ్రీడింగ్‌లో మాస్టర్ డిగ్రీ చదివింది. అగ్రికల్చర్ లోని అన్నీ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రతిష్టాత్మక ప్రొఫెసర్ మహమ్మద్ తస్కీన్ అలీ నియాజీ పేరిట ఇచ్చే స్వర్ణ పతకం, జెనెటిక్స్, ప్లాంట్ బ్రీ డింగ్ విభాగంలో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించినందుకు గానూ మాధవ వెంకట రాఘవయ్య బంగారు పతకం అందుకుంది. తేజస్విని పదో తరగతి వరకు బెల్లంపల్లిలో, ఇంటర్ మంచిర్యాలలో, బీఎస్సీ అగ్రికల్చర్ మహానంది లో, పీజీ పొలాసలో పూర్తి చేసింది. తేజస్విని తండ్రి మధునయ్య కోరుట్ల గురుకుల పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. మారుమూల గ్రామానికి చెందిన యువతి బంగారు పతకాలను సాధించడంపై అభినందనలు వెల్లువెత్తున్నాయి.

ఫార్మ్ ల్యాండ్ పేరిట రియల్ దందా..

(5వ పేజీ తరువాయి)

తరువాత ఫార్మ్ ప్లాట్లు చేతికి వస్తాయా...? అన్న సందేహాలు ఉన్నాయి. అప్పుడు ఫార్మ్ వెంచర్లు ఏర్పాటు చేసిన వారు అందుబాటులో ఉంటారా...? కొనుగోలుదారు పక్షాన ఎవరు బాధ్యత తీసుకుంటారన్న ప్రశ్నలు ఉత్పన్న మవుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు..

ఫార్మ్ (వ్యవసాయ) ప్లాట్లు కొంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇటీవల స్పష్టం చేశారు. ఆయా ప్లాట్లకు అధి కారికంగా అనుమతులు ఉండవని, వాటిలో చేపట్టే నిర్మాణాలకు పర్మిషన్లు కూడా ఇవ్వరని తెలిపారు. ఆ ప్లాట్లు కొనుగోలు చేస్తే తరువాత ఇబ్బందులు తప్పవన్న విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా తెలంగాణ మునిసిపల్ యాక్ట్-2019, పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం ఫార్మ్ ప్లాట్లు అమ్మవద్దని స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. రెండు వేల చదరపు మీటర్లు లేదా 20 గుంటల స్థలం ఉంటేనే వ్యవసాయ భూమిగా పరిగణించాలంటూ గతంలో ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. అలాగే ఫార్మ్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయవద్దని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకూ ఆదేశాలు ఉన్నాయి. అయి నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని తహసీల్దార్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఫార్మ్ ప్లాట్లకు యథేశ్చగా రిజి స్ట్రేషన్లు జరుగుతుండటం గమనార్హం. మరో వైపు జీవో 131 ప్రకారం 2020 ఆగస్టు 31 తర్వాత అక్రమ లే అవుట్లలోని ప్లాట్లకు అనుమతులు ఇచ్చేదని లేదని కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేసింది. 10 శాతం పార్కులు, 30 శాతం రహదారుల కోసం స్థలాలు కేటాయించి లేఅవుట్‌లు అభివృద్ధి చేయాలన్న నిబంధనలు పాటించకుండా కొందరు ఫార్మ్ ప్లాట్లు, అక్రమ లేఅవుట్లు చేసి అమ్మకాలు జరుపుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ కుటుంబాలకు భరోసా అందించడమే లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సభ్యులు

హాజీపూర్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఫొటో, వీడియో గ్రాఫర్ కుటుంబానికి భరోసా అందించడమే లక్ష్యంగా రాష్ట్ర యూనియన్ కృషి చేస్తుందని ఫొటో, వీడియో గ్రాఫర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ అన్నారు. ఆదివారం వేంపల్లి ఎస్వీఎస్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వేల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు అప్పాసు రాము, ప్రధాన కార్యదర్శి శ్వాస తిరుపతి, కోశాధికారి ముక్కెర స్వామిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి ఫొటో, వీడియో గ్రాఫర్ అభివృద్ధి సంక్షేమానికి రాష్ట్ర యూనియన్ బాధ్యత తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి, ఉపాధ్యక్షులు మహేశ్, ఉదయ్, మహిళా అధ్యక్షురాలు జయమాధురి పాల్గొన్నారు.

కొడుకు చేతిలో కత్తిపోట్లకు గురైన తండ్రి మృతి

ఇద్దరు నిందితులపై కేసు నమోదు

రాయికల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని మత్తడి వాడలో కొడుకు చేతిలో కత్తిపోట్లకు గురైన చిట్యాల లక్ష్మీనర్సయ్య(58) అనే వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. లక్ష్మీనర్సయ్యను అతడి కుమారుడు రాజేందర్ నెల 29న రాత్రి కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీనర్సయ్య వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని రాయికల్ ఎస్సై సుధీర్ రావు తెలిపారు. లక్ష్మీనర్సయ్య తనకున్న 10 గుంటల భూమిని విక్రయించేందుకు ప్రయత్నించాడు. దీంతో కుమారుడు రాజేందర్ తన స్నేహితుడైన అస్లాం సహకారంతో తండ్రిపై కత్తితో దాడి చేశాడు. క్షతగాత్రుడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తుండగా ఆదివారం మృతి చెందాడు. హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులు రాజేందర్, అస్లాంలను రిమాండ్ చేయగా తాజాగా హత్య కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై సుధీర్ రావు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నెన్నెల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని షెడ్యూలు కులాల ఉపసంచాలకులు సీహెచ్ దుర్గాప్రసాద్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహ విద్యార్థులకు అందించే మెనూను విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. వసతి గృహంలో ఉన్న వంట గదిని, పిల్లలు విశ్రాంతి తీసుకునే గదులను, మూత్రశాలలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులకుప్రత్యేక తరగతుల నిర్వహణ కోసం ట్యూటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల సీజన్ దృష్ట్యా వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట వసతి గృహ సంక్షేమ అధికారి జయశంకర్ ఉన్నారు.



నెన్నెల ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

ఘనంగా స్నేహితుల దినోత్సవం



మందమర్రిలో ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు నిర్వహిస్తున్న మిత్రులు



దండేపల్లి కస్తూర్బాలో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుంటున్న బాలికలు

మందమర్రిటౌన్, ఆగస్టు3 (ఆంధ్రజోతి): పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఫ్రెండ్ షిప్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి ఒకరి కొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపూరి లక్ష్మణ్, కంది సంతోస్, అర్జున్‌కుమార్, ఎండీ పాషా, సదానందం పాల్గొన్నారు.

దండేపల్లి : ఈ సృష్టిలో రక్తసంబంధం లేకుండా మన కోసం ఆలోచించే బంధం ఏమైనా అంది అంటే అది స్నేహబంధం ఒక్కటే అనే నిరుపించుకునే స్నేహతులు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం దండేపల్లి మండలంలోని మేదరిపేటలో లయన్స్ క్లబ్ సభ్యులు, దండేపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బాలికలు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టుకుంటుకొని వేడుకల ను ఉత్సాహంగా జరుపుకున్నారు. లయన్స్ క్లబ్ నిర్వహకులు మాట్లాడుతూ కుల మత బేధం తేడా లేకుండా ఒకరి కష్టాలను ఒకరు పంచుకోవడమే ఇద్దరి మధ్య అసలైన స్నేహమని పేర్కొన్నారు. భూమి మీద వెలకట్ట లేనిది ఒక్క స్నేహమేనన్నారు. అనంతరం ఒకరినోకరు శుభాకాంక్షలు తెలుపుకుని ఫ్రెండ్ షిప్ బ్యాండ్లు కట్టుకున్నారు.

కార్యక్రమంలో దండేపల్లి మండల లయన్ క్లబ్ సభ్యులుచ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ బాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హమాలీ సంఘం కార్యవర్గం



హమాలీ సంఘం నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

మంచిర్యాలక్రైం/ కలెక్టరేట్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): హమాలీసంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఆదివారం ఎన్నుకున్నారు. సంఘంగౌరవ అధ్యక్షులు పూదరి తిరుపతి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా చిట్టవేని లక్ష్మణ్, జనరల్ సెక్రటరీగా బోడకుంట్ల రాంచందర్ ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ హమాలీ సంఘంకోసం తమవంతుగా కృషి చేస్తామని సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని అన్నారు.

బీసీ సంఘ నాయకుల అరెస్టు

జన్నారం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): చలో ఢిల్లీ బీసీ గర్జనకు తరలుతున్నారన్న సమాచారం మండలంలో బీసీ సంఘ నాయకులను జన్నారం పోలీసులు ముంద స్తు అరెస్టు చేశారు. పై అధికారుల ఆదే శాల మేరకు అరెస్టు చేస్తున్నామని చెప్పినట్లు తెలిపారు. అదే విధంగా బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్యతో పాటు బీసీకులాల ఉద్యమ పోరాట సంఘం జిల్లా కన్వీనర్ ఆడెపు లక్ష్మీనారాయణలను ఆదివారం అరెస్టు చేసినట్లు తెలిపారు. కొన్ని గంటల పాటు స్టేషన్‌లో కూర్చోబెట్టి హెడ్ కానిస్టేబుల్ సంతకాలు తీసుకొని స్వంత పూచికత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

మహిళలకు వైద్య పరీక్షలు

నస్పూర్ పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం వికాస తరంగిణి నస్పూర్‌శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత మహిళ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గర్భకోశ, రొమ్ము క్యాన్సర్, కంటి పరీక్షలకి సంబందించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు, హనుమంతరావు, ఉమా, నస్పూర్ వికాస తరంగిణీ అధ్యక్షులు టి. భాస్కరరావు, కార్యదర్శి భాగ్యలక్ష్మీ, ఆరోగ్య వికాస్-కోఆ ర్డినేటర్ వనజ, వికాస తరంగిణి కార్య కర్తలు పాల్గొన్నారు.

ఫార్మ్ ల్యాండ్ పేరిట రియల్ దందా..



- అనుమతులు లేకున్నా వెంచర్లు ఏర్పాటు
- గుంటల చొప్పున వ్యయసాయ భూముల అమ్మకం
- నిర్మాణ అనుమతులు రావని తెలిసీ అంటగడుతున్న వైనం
- రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నూతన అంకానికి తెర
- ఫార్మ్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయవద్దనే నిబంధన తుంగలోకి

మంచిర్యాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్ల వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా ఇష్టారీతిన గుంటల చొప్పున ప్లాట్లు ఏర్పాటు చేస్తూ అధిక ధరలకు అంటగడుతున్నారు. జిల్లాలోని జైపూర్, భీమారం, హాజీపూర్, లక్షెట్టిపేట, మందమర్రి మండలాల్లో రియల్ వ్యాపారులు ఇటీవల ఈ నూతన అంకానికి తెరలేపారు. ఫార్మ్ ల్యాండ్ వెంచర్లు కావడంతో నిబంధనలు అనుసరించాల్సిన అవసరం లేదని నమ్మబలుకుతూ ప్లాట్ల వ్యాపారం చేస్తున్నారు. ఆయా వెంచర్లలో విక్రయాలు చేస్తున్న ప్లాట్లలో భవిష్యత్తులో నిర్మాణ అనుమతులు రావని తెలిసి మరీ అంటగడుతుండటం గమనార్హం.

ఐదు గుంటలకు ఒక ప్లాటు చొప్పున...

ఫార్మ్ వెంచర్లలో వ్యాపారులు ఐదు గుంటలకు ఒక ప్లాటు చొప్పున ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతున్నారు. వీటిని ముఖ్యంగా వైద్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో ప్లాటుకు రూ.20 లక్షల నుంచి రూ. 40 లక్షల మేర డబ్బులు వసూలు చేస్తున్నారు. ఆ ప్లాట్లలో శ్రీగంధం చెట్లను తామే పెంచుతామని, గరిష్ఠంగా 15 సంవత్సరాల్లో పంట చేతికి వస్తుందని చెబుతున్నారు. పంట లాభాల్లో యజమాని, ప్లాటు కొనుగోలుదారులకు సమాన భాగస్వామ్యం ఉంటుందని, అనంతరం ప్లాట్లను కొనుగోలుదార్లకు హ్యాండోవర్ చేస్తామని మభ్యపెడుతున్నారు. వ్యాపారుల మాటలకు ఆకర్షితులవుతున్న కస్టమర్లు లక్షలు వెచ్చిస్తూ పెద్ద మొత్తంలో ఫార్మ్ ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు.

రైతు భరోసా అమలు...

ఫార్మ్ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన అనేక మందికి రైతు భరోసా అమలవుతుండడం కొసమెరుపు. వెంచర్ కోసం వినియోగించిన భూము లను సబ్ డివిజన్ చేయకపోవడం, అవి ఇప్పటికీ వ్యవసాయ భూములుగానే ఉండడం, ఆ భూములకు నిర్వాహకులు నాలా కన్వర్షన్ కూడా చేయించకపోవడంతో రిజిస్ట్రేషన్లు జరిగినవారి పేరిట రైతు భరోసా సొమ్ము అక్రమంగా జమ అవుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇప్పుడు ప్లాట్లు కొనుగోలు చేస్తే...ఎప్పుడో 15ఏళ్ల తరువాత అందజేస్తామని వ్యాపారులు చెబుతుండటంతో గుడ్డిగా వాటివైపు మొగ్గు చూపుతున్నారు. భూముల ధరలు ఆకాశాన్నంటుతున్న నేటి రోజుల్లో.... అన్ని సక్రమంగా ఉండి, దశాబ్దాల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లు, భూములు ఇతర పేరిట అక్రమంగా రికార్డుల్లోకి ఎక్కుతున్నాయి. ఏదో ఒక లిటిగేషన్‌తో ఇతర భూములను స్వాధీనం చేసుకోవడం షరా మామూలు అయింది. ఈ క్రమంలో 15ఏళ్ల ..

(తరువాయి 7లో)

కేజ్‌వీల్స్‌తో ధ్వంసమవుతున్న రహదారులు

దండేపల్లి ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వరినాట్ల సీజన్ కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో సీసీరహదారులపై రైతులు కేజీవీల్స్ నడుపుతుండడంతో రహదారులు ధ్వంసం అవుతున్నాయి. లక్షలాది ప్రజాధనంతో నిర్మించిన రోడ్లు మూణ్ణాళ్లకే ఛిద్రమవుతున్నాయి. ఒకవైపు ప్రభుత్వం కేజ్ వీల్స్‌కు పట్టీలు తొడిగించి తీసు కెళ్లాలని సూచించినప్పటికీ పట్టించుకోవడం లేదు. అధికారులు గ్రామాల్లో పర్యటించి రోడ్డు ధ్వంసం కాకుండా ట్రాక్టరు యజమానులు, గ్రామ పెద్దలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. లేదంటే భారీ జరిమానాలు విధించి రోడ్లను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సీటి రోడ్డుపై వెళ్తుతున్న కేజీవీల్స్ ట్రాక్టర్

ప్రజల సహకారంతోనే గంజాయి, డ్రగ్స్ నిర్మూలన

- మంచిర్యాల డీసీపీ భాస్కర్



షార్ట్ ఫీలింను రిలీజ్ చేస్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే గంజాయి, డ్రగ్స్ నిర్మూన సాధ్యమవుతుందని యువతను చైతన్య పరచడం కోసం అక్షయ ఆర్ట్ ప్రోడక్షన్ బ్యానర్‌పై పంచమి షార్ట్‌ఫిలీం డ్రగ్స్‌పై అవగాహన పెంచేందుకు షార్ట్‌ఫిలీం తీయడం ఎంతో అభి నందనీయమని డీసీపీ భాస్కర్ అన్నారు. శనివారరం షార్ట్‌ఫిలీం టీజర్‌ను డీసీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా యువత గంజాయికి అలవాటుపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పోలీసు డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గంజాయి వినియోగం అరికట్టడంలో పకడ్బందీ చర్యలు తీసుకున్నామన్నారు. అక్షయ ఆర్ట్ ప్రోడక్షన్ ఆధ్వర్యంలో సిని నిర్మాత బోడకుంట రవీందర్ కథ, స్క్రీన్‌ప్లే దర్శకత్వం వహించిన కర్రె శ్రీనివాస్‌ను ఆయన అభినందించారు. డీసీపీగా దుర్గం వినయ్‌కుమార్ పని చేయగా రవీందర్, సిరి ప్రధాన పాత్ర వహించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులు


నస్పూర్,ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): సీసీసీ-లయన్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కంటి, బీపీ షుగర్ వైద్య శిబిరంలో గోదారికాలనీ శ్రీరాంపూర్ ఏరియాలకు చెందిన 80 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 40 మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయడానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు సుధాకర్, అభిషేక్, వెంకటేశ్వర్లు, హనుమంతరావు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు వానమామలై సత్యనారాయణ



పాఠశాల పూర్వ విద్యార్థులు

శ్రీరాంపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : భగత్‌సింగ్ విద్యాసంస్థ వ్యవస్థాపకుడు వానమామలై సత్యనారాయణ ఆదర్శణీయులని పలు వురు వక్తలు పేర్కొన్నారు. సత్యనారాయణ సార్ మరణించి పదేళ్లు అయిన సందర్భంగా పాఠశాలలో పూర్వవిద్యార్థులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఆయన జ్ఞాపకార్థం మేడం పద్మజ, వారి కుమారుడు కళాప్ర వీణ్, కూతురు వైజయంతిమాల ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఉన్న శ్రీరాంపూర్ సంత నుంచి పూర్వ భగత్‌సింగ్ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన చరిత్రతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, భగత్‌సింగ్ విద్యామందిర్‌ను 1983 లో ప్రారంభించి మూడు దశాబ్దాల పాటు ఎంతో మంది విద్యార్థులకు విద్యను అందించి ప్రయోజకులను చేశారని కొనియాడారు. అనంతరం పూర్వ విద్యార్థులు సత్యనారాయణ సార్‌తో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేంద్రపాణి, రమేష్, కేదారి, బాలాజీ పాల్గొన్నారు.



గూడెం గుట్టపై ముస్తాబైన శ్రీరామా సహిత సత్యనారాయణస్వామి దేవతమూర్తులు

గూడెంగుట్టలో రేపటి నుంచి పవిత్రోత్సవాలు

దండేపల్లి ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం గుట్ట శ్రీ సత్యనారాయణస్వామి దేవస్థానంలో ఈనెల 5 నుంచి 7వరకు ఆలయ పవిత్రోత్సవాల వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో సంక టాల శ్రీనివాస్ తెలిపారు. పవిత్రోత్సవం సందర్భంగా మంగళవారం పవిత్ర గోదావరి జలాలను తీసుకవచ్చి తీర్థబిందెతో పవి త్రోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. మూడు రోజుల పాటు వేద పండితులు, ఆలయ అర్చకుల సమక్షంలో పవిత్రోత్సవ ప్రత్యేక పూజ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అందుకు ఆలయంలో అవసర ఏర్పాటు చేయడంలో ఆలయ సిబ్బంది నిమగ్నమయ్యారు.

సత్యదేవుడి సన్నిధిలో పూజలు

దండేపల్లి ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం పురస్కరించుకోని దండేపల్లి మండలం గూడెంగుట్ట శ్రీసత్యనారాయణ స్వామి పుణ్యక్షేత్రంలో రెండో ఆదివారం సందర్భంగా భక్తులతో శోభ సంతరించుకుంది. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు కుటుంబన మేతంగా గూడెం ఆలయానికి రావడంతో భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం నుంచే భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి పూజలు చేసి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకొని భక్తులు సత్యదేవున్ని దర్శించుకొని శ్రావణపూజలు చేశారు. వందలాది మంది భక్తులు కుటుంబసమేతంగా స్వామి వ్రతాలను నోముకున్నారు. అనంతరం సత్యదేవున్ని దర్శించుకోని శ్రావణ ప్రత్యేకతో మొక్కులు చెల్లించుకున్నారు.

బీజేపీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చెన్నూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు గోమాస శ్రీనివాస్, దుర్గం అశోక్‌లు పేర్కొన్నారు. ఆదివారం కిష్టంపేట గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వారు మాట్లాడుతూ పీఎం మోదీ దేశరక్షణ, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అబద్ధపు హామీలతో అధి కారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని స్థానిక ఎన్నికల్లో బొంద పెట్టాలన్నారు. బీజేపీ ప్రతినిధులను ప్రజలందరు గెలిపించాలన్నారు. ఈ కా ర్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్‌గౌడ్, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, సమ్మన్న, శ్రీపాల్, ఎల్లయ్య పాల్గొన్నారు.



కిష్టంపేటలో గ్రామస్థులకు మోదీ పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- ఎస్సీ జాతీయ కమిషన్ మెంబర్ కుమార్

లక్షెట్టిపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు భారతీయ జనతాపార్టీదే అని ఎస్సీ జాతీయ కమిషన్ మెంబర్ ఎస్.కుమార్ అన్నారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలంలోని దౌడేపల్లి గ్రామంలో నిర్వహించిన గడప గడపకూ బీజేపీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ 11 ఏళ్ల సుపరి పాలనతో ప్రజల సంక్షేమం కో సం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అంతే కాకుం డా చేసిన అభివృద్ధిని ఇంటింటికి తిరుగూ ప్రజలకు తెలియజేస్తామన్నారు. ప్రతీ బీజేపి కార్యకర్త గ్రామా ల్లో, పట్టణాల్లో తిరుగుతూ మోదీ చేసి న అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని కోరారు. అంతకు ముందు జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్‌తో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమం పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి హేమంత్‌రెడ్డి అధ్యక్షతన కొనసాగగా అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొండచిలువ పట్టివేత



వలలో చిక్కుకున్న పైథాన్ పాము

భీమారం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్బీపేట గ్రామంలో ఆదివారం అటవీ అధికారులు కొండచిలువను పట్టుకున్నారు. గ్రామంలోని మోహన్ రెడ్డి ఇంటి వెనకాల ఉన్న వలలో కొండచిలువ చిక్కుకోగా గమనించిన మోహన్‌రెడ్డి అటవీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ అధికారులు సుధాకర్, శ్రీకాంత్‌లు వెళ్లి పామును పట్టుకుని ఎల్కేశ్వరం బీట్‌లోని కంపార్టు మెంట్ నెంబర్ 315లో చెక్‌డ్యామ్ ప్రాం తంలో విడిచి పెట్టారు.

ఆలస్యమైతే ఆబ్సెంటే..

- ఉపాధ్యాయులకు ఫేస్ రికగ్నిషన్ హాజరు ప్రారంభం
- సమయపాలన కోసం సర్కారు ప్రత్యేక యాప్
- పాఠశాల ఆవరణలోనే పని చేసే విధంగా రూపకల్పన 6

పడకేసిన పారిశుధ్యం

- పట్టించుకోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం 7

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కలవేన శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలవేన శంకర్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కలవేన శంకర్ పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపై విశ్వాసంతో ప్రజలు గెలిపించారని, కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందన్నారు. ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సదరం సర్టిఫికెట్ల గడువు ముగిసిన వారు పెన్షన్‌లు రాక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సదరం సర్టిఫికెట్‌ల గడువు పొడగించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కలీందర్ అలీఖాన్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, మిట్టపల్లి వెంకటస్వామి, పూర్ణిమ, రేగుంట చంద్రశేఖర్, చిప్ప నర్సయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదర్శపాఠశాలలో హావర్లీబేస్డ్ పద్ధతిన సివిక్స్ సబ్జెక్టు బోధించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సారా తస్నీమ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఎంఏ పొలిటికల్ సైన్స్, బీఈడీ అర్హత కలిగి ఉండాలని, అభ్యర్థులు తమబయోడేటా, జిరాక్స్ కాపీలతో ఈనెల 5లోగా పాఠశాలలో అందజేయాలని సూచించారు.

ప్రజాహిత పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలక్రైం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నట రా జన్, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కు మార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాహిత పాదయాత్రలో మంచిర్యాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్ల సత్య నారాయణ, నాయకురాల్లు రజిత పాల్గొన్నారు.



పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు